# అంతా ఘటన

రాత్రి సినిమాకి వెళ్లొచ్చేసరికి ఉదయం లేచేసరికి బారెడు పొద్దెక్కింది. ఇంట్లోవాళ్ళంతా ఎవరిపనుల్లో వారు న్నారు. నాన్నగారు ఆఫీసు రూమ్‌లో కూర్చుని ఏదో పుస్తకం చదువుతున్నారు. ఆయన చూడకుండా గబగబ పెళ్ళి కాల కృత్యాలు తీర్చుకొని కాఫీతాగి నాపని చూసుకోటానికి గదిలోకి వచ్చాను. నాన్నగారు అక్కడే వున్నారు. "రవీ! సాయంత్రం 5 గంటలకి రెడీగావుండు. ఇవాళ పెళ్ళికూతురుని చూడటానికి వెళ్ళాలి" అన్నారు. ఆ అమ్మాయి యెవరన్న సందేహం వచ్చి "ఏ అమ్మాయిని" అన్నాను. "ఏ అమ్మాయి అయితే నీకెందుకు? 5 గంటలకి రెడీగావుండు. అంతే నువ్వు చేయవలసినది." అన్నారు. ఈ మాటలకు నా అహంభావం దెబ్బతింది. ఏమంటారో అని వూహించకుండా "నేను ఇంకా పెళ్ళిచేసుకోదల్చుకో లేదు" అన్నాను. "అహాహా...చా...లా బావుంది! చదువుతున్నన్నాళ్ళు చదువయ్యాక అనటం. చదువయ్యాక ఉద్యోగం అయ్యాక అనటం. ఇది ఈ కాలపువాళ్లకి పరిపాటయిపోయింది. ఇలాటివాళ్లని చాలా మందిని చూశాను. చిన్నతనంలో పెళ్ళిచేసుకుంటే పెద్దతనంలో చేతికి అందివచ్చే కొడుకుని చూచి సంతోషించవచ్చు. ఊళ్లు తిరిగే ఉద్యోగాలు నీవి. ప్రతిచోటికి ఎవరువస్తారు. హాయిగా పెళ్ళిచేసుకొని సుఖంగా వుండు.' అని పెద్ద ఉపన్యాసం ఇచ్చారు. ఇంక ఏమీ చేయలేక "సరే మీ యిష్టం. కాని......" "కానీను...అర్థమైంది...ఏమిటో త్వరగా చెప్పు" అన్నారు. "కాని...సంతలో పశువుల్ని చూసినట్లు అమ్మాయిల్ని చూసి తరువాత ఒద్దనటం నాకు ఇష్టంలేదు. పాపం ఇలా యెంతమందిచూసి ఒద్దంటారో. ఇలా అంగాంగపరిశీలన అయ్యాక పెళ్ళిఅవకపోతే ఆ అమ్మాయి ఎంత బాధపడుతుందో! నాకు చేతనయినంతమటుకు ఇలాంటి అన్యాయం కలుగకుండా చేస్తాను. అందుచేత అంతా స్థిరమయితేగాని నన్ను పిల్లని చూడమని అడగద్దు" అని ధైర్యంచేసి అనేశాను. అప్పుడు మా నాన్నగారు "ఏడిసినట్టేవుంది, నీ సలహా. ఇది పూర్వకాలంనుండి వస్తున్న ఆచారం. నీకోసం ప్రత్యేకంగా పెట్టినది కాదు తెలుసా? ఇవి మన పూర్వీకులు పెట్టినవే. అన్నీ స్థిరమయ్యాక ఆ అమ్మాయిని చూసి బాగుండలేదనటం చాలా అసహ్యకరమైన విషయం. ముందే చూసి ఆ అమ్మాయి బాగుండకపోతే జాతకం కుదరలేదనవచ్చుగాని, అన్నీ కుదిరాక బాగుండలేదంటే ఆ అమ్మాయి ఎంత బాధపడుతుందో ఆలోచించావా" అన్నారు. "హరి భగవంతుడా నిజంగా నాకు నచ్చి జాతకం కుదరకపోతే చెయ్యరనగానే నాకు భయంవేసింది. నేను ఏమీ సమాధానం చెప్పలేదు. ఇంకా అంటున్నారు, "ఎవ్వరు ఈ ఆచారంగురించి బాధపడనప్పుడు నీ కెందుకోయి ఆ బాధ? అంతేకాకుండ తిరస్కరించటం చాలవాటిమీద ఆధారపడివుంది. రుచులు వేధిస్తాయి. నాకు తెలిసినంతమటుకు ఈ అమ్మాయి చాల బావుంటుందిట. అన్నీ అనుకూలిస్తే ఇదే జరగవచ్చు." అన్నారు. ఇంక చేసేదిలేక అమ్మాయిని చూడటానికి ఒప్పుకున్నాను.

### కుమారి పి. పద్మ

ఆ వేళ సాయంత్రం సరిగా ఐదుగంటలకి ఒక గుఱ్ఱంబండి వచ్చి మా యింటిముందు ఆగింది. ఆ బండి పెళ్ళికూతురు తరఫువారు పంపినదనటానికి ఏమాత్రం సందేహం లేకపోయింది. పాపం! ఆడపిల్లలు గలవారు ఇన్ని అగచాట్లు పడితేగాని పెళ్ళిళ్ళు అవ్వవుగాబోలు! ఇలా ఎంతమంది ఇళ్ళకి ఈ గుఱ్ఱంబండి వెళ్ళిందో అని ఆలోచిస్తు మెట్లుదిగాను. కాని, ఆ బండిదగ్గర వున్న వాళ్ళనిచూస్తే నాకు చాలఆశ్చర్యంవేసింది. అమ్మ, నాన్న కాకుండ ఇంకా చాలమంది వున్నారు. మా మామయ్య, అత్తయ్య, మా మేనత్త. మా నాన్నగారిని లోపలికి పిలిచి వీళ్ళంతా ఎందుకు అన్నాను. నాన్నగారికి కోపంవచ్చింది. "వీళ్ళంతా వచ్చితీరాలిసిందే" అన్నారు. ఇంక చేసేదిలేక ఆ యుద్ధ సైన్యంలో ఆబండి బయలుదేరింది. చాల ఇరుగ్గావుంది. ఒళ్ళంతా హూనంచేసుకొని ఎలాగయితేం ఆ పెళ్ళివారి ఇంటిముందు ఆగాము. ఒక ముసలాయన ఇంటి గుమ్మం ముందు సిద్ధంగా వున్నాడు. పెళ్ళికూతురు తండ్రిలాగే వున్నాడు. నాకు ఆయన్ని చూస్తే జాలివేసింది. పాపం ఇలా ఎంతమందికి స్వాగతం పల్కాడో అని. అప్పుడే మేమువచ్చినట్లు చుట్టుప్రక్కల దావాగ్నిలా వ్యాపించింది. చుట్టుపక్కలవున్న కిటికీలన్నీ సుందరాంగనల నయనాలతో నిండిపోయాయి. ఆ చూపులకు నేను తట్టుకోలేకపోయాను. "రండి, రండి. ప్రయాణం సుఖంగావుందా?" అన్న మధుసూదనరావుగారి స్వాగతవాక్యాలతో తేరుకున్నాను.

ఆయన మందస్మిత వదనంతో మమ్మల్ని ఒక గదిలోకి తీసుకువెళ్ళారు.' ఒక చక్కటి రౌండు టేబిల్ అమర్చివుంది. దానిమీద వెలిగించబడిన అగరువత్తులు వాసనలను గదిఅంతా విరజిమ్ముతున్నాయి. ఒకమూల వీణ తనస్థానాన్ని ఆక్రమించుకుంది. కొంతసేపటికి గుమ్మంలో గాజుల చప్పుడు వినిపించింది. ఆమె వస్తోందనుకున్నాను. కాని పెళ్ళికూతురు తల్లి అనుకుంటా కాఫీ ఫలహారాలు పట్టుకువచ్చింది. ఆవిడ వస్తూనే నన్ను నఖశిఖపర్యంతం పరీక్షించింది. ఆమె వదనంలో ఆనందరేఖ తాండవించింది. ఇంతలో మధుసూదనరావుగారు "అమ్మా నిర్మలా ఇలా రామ్మా" అన్నారు. మల్లెపూల వాసనలు, గాజుల గలగలలు ఆమె వస్తోందని సూచించాయి. ఆహాహా...ఏమి దృశ్యం! సిగ్గు, ఆత్రత, సంతోషం ఇత్యాది అన్నీ ఆమెలో నిండివున్నాయి. ఆ లేత కళ్ళతో బెదురుచూపులు చూస్తోంది. సరిగ్గా నా ఎదురుగుండా కూర్చుంది. నిజం చెప్పాలంటే ఆమెను చూడాలంటే నాకే ఏమిటో అనిపించింది. ఇదేకాకుండా మధుసూదనరావుగారు నన్ను చాల ఆత్రతతో పరిశీలిస్తున్నారు. అతికష్టంమీద ఆ అమ్మాయిని చూశాను. ఆమె అందం, ఆ నాజూకుతనం, ఆ సోగకళ్లు, నవ్వితే సొట్టలుపడే ఆ బుగ్గలు నన్ను ముగ్ధుడిని చేశాయి. ఆ తుమ్మెద రెక్కలవంటి జుట్టు ఆమె సౌందర్యానికి మెరుగుదిద్దింది. ఆమె సౌందర్యదేవత అంటే అతిశయోక్తి లేదు. "నిర్మలా ఒక పాట పాడమ్మా" అన్న మధుసూదనరావుగారి పలుకులతో ఈలోకంలోకి వచ్చిపడ్డాను. "మా అమ్మాయిది చాలా చక్కని కంఠం. చూడమ్మా ఇతగానికి సంగీతంఅంటే చాల అభిరుచి. అందుచేత చాల జాగ్రత్తగా పాడమ్మా" అన్నారు. అది విని ప్రతితండ్రి తన కూతురునిగూర్చి ఇలానే చెప్పుకుంటాడనుకున్నాను. కాని నాకు తెలియకుండానే ఎవరిని సంబోధించకుండా "ఏమీ భయపడవద్దు. నాకు సంగీతంఅంటే అభిరుచేకాని నాకు రాకన్నాను," అలా అని నాన్నగారి

# ★ అంతా ఘటన ★

వేపు చూశాను. "అలా కాదు మాట్లాడవలసిన విధం" అన్నట్లుగా చూశారు.

నిర్మల వీణకు నమస్కరించింది. మొదట చాల తగ్గుస్థాయిలో వీణమీటింది. ప్రశాంత వాతావరణంలో ఏవో మధురమైన ధ్వని తరంగాలు ఆగదిలో నాల్గుమూలలా వ్యాపించి నిరమించాయి. ఆమె గానమాధురి అచట నున్న వాళ్ళందరిని తన్మయులను చేసింది. కోమలమైన ఆమెచేతి వ్రేళ్లు వీణాతంత్రులపై నృత్యము చేస్తున్నాయి. ఆమె వ్రేళ్ళ కదలిక చూస్తుంటే అసలు వీణ మీటుతోందా లేక ఊరికె వ్రేళ్ళను పైపైన త్రిప్పుతున్నదా యని అనుమానం వేసింది. నిజంగా ఆ వీణ శృతిలో ఆమెకంఠం కలిసిపోయింది.

ఆమె పాడిన రెండిటిలో ఒకటి నా ప్రీతి పాత్రమైనది. ఆమె గానమాధురి నన్ను ఆనందడోలికలలో తేలియాడ జేసింది. ఆ ఆనందంలో "ఏమీ అభ్యంతరం లేకపోతే ఇంకో పాట" అన్నాను. "ఓ తప్పకుండ" అన్నారు మధుసూదన రావుగారు. "నీ ఉద్దేశాలను అప్పుడే బయట పెట్టద్దు" అన్న దృష్టిలో చూశారు. నాన్నగారు.

ఈసారి ఆమెపాట చాల ఉన్నత స్థాయి నందుకుంది. ఆ పాట ముగించి ఆమె లోపలికి వెళ్ళిపోయింది. లోపలవున్న మాఅమ్మ వాళ్ళు ఆమె గానామృతాన్ని మెచ్చుకోకుండా వుండలేకపోయారు. మా మనస్సులో వుండే భావాల్ని వ్యక్తం చేసుకోటం కోసం మధుసూదనరావుగారు లోపలికి వెళ్ళారు. ఆయన వెళ్లిన వెంటనే "ఎలా వుందిరా అమ్మాయి" అన్నారు నాన్నగారు. పట్టరాని సంతోషంతో "అబ్బ, చాలా బావుంది" అనేశాను. "ఉష్ అంతగట్టిగా చెప్పకు కాస్త జాగ్రత్తగా వుండు" అన్నారు. "ఏమైనా సరె ఈ అమ్మాయినే పెళ్ళిచేసుకుంటాను" అన్నాను గట్టిగా. "అప్పుడే! అప్పుడే అంత తొందరా? ఇంకా ఎంత వుంది కథా కామాయిషి. కట్నం అవీ మాట్లాడద్దూ? అన్నారు "కట్నం" అన్నమాట వినగానే నా గుండె సగంజారిపోయింది. ఇదెక్కడ కర్మంరా బాబు కట్నం దగ్గర పేచీవచ్చి ఈ అప్సరస చేయిజారిపోతుందేమో అన్న భయం నన్నావరించింది. "కట్నం విషయం ఏమీ పేచీ పెట్టకండి" అన్నాను. "సరేలే కాస్త వూరుకో ఆయన వస్తున్నారు. నీ ఉద్దేశ్యం తెలిసింది. తరువాత ఏంజేయాలో మాకు తెలుసు" అన్నారు. "మరి కొంచెము కాఫీ పుచ్చుకుంటారా" అన్న మధుసూదనరావుగారి మాటలతో ఈ లోకం లోకి వచ్చాము. "అబ్బే అక్కర్లేదు. చీకటిపడుతోంది మేము సెలవు పుచ్చుకుంటాము" అన్నారు నాన్నగారు. ఆయన భోజనంగూడా చేయమని బలవంతంచేశారు. "అబ్బే కలిసి తే అతికదంటారు. బలవంతం చేయకండి" అని చెప్పుతూ నాన్నగారు బయలుదేరారు.

వాళ్ళ ఇంటిమెట్లు దిగుతున్నాను. కొంచెంగా నా కాలు జారింది. దగ్గరనున్న స్తంభం నా తలకి తగిలింది. అబ్బా అని రుమాలు అద్దాను. రుమాలు తీసే సరికి ఏముంది....రక్తం. నా ఆశ్చర్యానికి అంతు లేకపోయింది. ఇదేమిటి ఈ కాస్తదెబ్బకి రక్తం వచ్చిందని ఆశ్చర్యపోయాను. మా నాన్నగారు, అమ్మ ఒకరి ముఖాలు ఒకరు చూసుకొని ఇతరులకు అర్థంకాని మూగ సంజ్ఞలు చేసుకున్నారు. వాళ్ళ ముఖకవళికలుగూడా మారిపోయాయి. గాయం కడుక్కుని కాసేపుకూర్చుని బయలుదేరాము. బండి కదలీ కదలగానే "మనకీ సంబంధం ససేమిరా వద్దేవద్దు. అక్కడ వుండగానే వాళ్ళఇంట్లో రక్తం చూడటమా" అని అమ్మ అంది. "అయ్యో నిజమే! ఎంత దుశ్శకునం" అని నాన్నగారు గూడ అమ్మతో పాట కలిపారు. ఈమాటలువింటూంటే నా తలగిర్రున తిరిగిపోయింది. నాఆశలన్ని అడియాశలయ్యాయి, నా గాలిమేడలన్నీ కూలిపోయాయి. వాళ్ళ బండివాడిదగ్గరే ఇన్నిమాటలు దులిపేశారు. ఆవేశంగా ఈ ఆచారాలన్నిటిని చంపి పారవెయ్యా లనిపించింది. వాళ్లు మొదలు పెట్టారు మళ్ళీ. "రక్తం, రక్తమే. ఏంమాట లనుకున్నావా? అక్కడవుండగానే రక్తం చూశామంటే ఏమిటో తెలుసా? పెళ్ళి అయిన మొదలుకొని నువ్వు నరకం అనుభవిస్తావు. బ్రతికి బయటపడ్డాము. ఏదో ఈ విధంగా మనకి దేవుడు ఆసంబంధం చేసుకోవద్దని చెప్పాడు, ఇంకానయం" అని ఈవిధంగా నాన్నగారు మాట్లేడుస్తున్నారు. ఆవేశం పట్టలేక "నాన్నగారూ! నా జీవితాన్ని నాశనంచేసి, నా శవం చూడాలంటే ఈపని చేయండి" అన్నాను. అక్కడ నా మాట వినేవాళ్లెవరయినా వుంటేగా "బాగా ఆలోచించుకో, తొందరపడకు. ఇంతకంటె సంగీతవిద్వాంసురాలు, ఇంతకంటె చక్కని అప్సరస దొరక్కపోదు." అన్నారు.

"చూస్తానుగా ఈఅమ్మాయిని కాకుండా ఇంకొకరినిచ్చి ఎలా పెళ్లి చేస్తారో" అన్నాను. ఇల్లు చేరుకున్నానన్నమాటేగాని నా మనస్సంతా నిర్మలమీదేవుంది. కళ్ళు మూసినా తెరచినా ఆమెవిగ్రహమే. ఏమి వింటున్నా ఆమె పాటలాగే వుంది. ఒకటి రెండుసార్లు వాళ్లి ఇంటి పరిసరాలకి వెళ్లాను, నిర్మల కనపడుతుందేమోనని కాని కనపడలేదు. ఒక వారంరోజులు నా మనసు మనసులోలేదు. ఏమిటా ఇలా అయిందని విచారించాను. ఈ వారంరోజులలో చాల సార్లు ఉత్తరాలు రాసిపంపారు కాని వాటికి వేటికి సమాధానాలు వెళ్లలేదు.

తలవని తలంపుగా వాళ్ల ఇంటిపరిసరాలలో ఒకరోజుసాయంత్రం ఆమెని కలుసుకున్నాను. కాని ఆమె మాట్లాడలేదు. తీక్షణమైన దృక్కులను నాపై ప్రసరింపజేసింది. ఆచూపులకు తట్టుకోలేకపోయాను. ఈర్ష్య, క్రోధం, అసంతృప్తి, జుగుప్స అన్నీ అందులోవున్నాయి. నిర్మలని పలకరిద్దామనుకున్నాను. కాని ధైర్యం చాలలేదు. అతికష్టంమీద ఇల్లుచేరుకున్నాను. నాహృదయంలోని బరువు తగ్గించుకోటంకోసం ఎంత సేపు ఏడ్చానో నాకే తెలియదు. "ఏంరా, ఒంట్లో బాగాలేదా" అన్న నాన్నగారి పిలుపుతో లేచాను. "ఊరికె నేపడుకున్నా" అని అన్నాను. "మరి రెండుకళ్ళు ఎఱ్ఱగావున్నాయేం" అన్నారు. "దుమ్ముపడింది." "రెండు కళ్లలోను ఒక్కసారేనా" అంటూ చిరునవ్వు నవ్వేరు. నాకు చాల కోపంవచ్చింది. చేసింది చాలక పైగా నవ్వుగూడాను. ఇంతలో పిడుగుపడ్డట్టుగా "ఏడవకు సంబంధం నిశ్చయించాను లే" అన్నారు.

"నాన్నగారూ........."

"నిర్మలనే. గాభరాపడకు మరెవరూ గాదు. భగవాన్లుగారు లేరూ? మంచి పండితులు. ఆయన చూసిపోదామనివచ్చారు. సరే ఈవిషయం చెప్పాను. ఆయన చెప్పారు రక్తం కుంకుమవంటిదని, అది కనబడటం చాల శుభసూచకం అనిగూడా చెప్పారు." ఆయన ఈమాటలు అతినెమ్మదిగా చెప్పారు. ఇన్ని రోజులు నేపడ్డబాధ ఆయన కేంతెలుసు. పట్టరాని సంతోషంతో "అయితే మధుసూదన రావుగారి నెప్పుడు కలుసుకుంటారు," అన్నాను. "ఇంకా ఎప్పుడు కలుసుకోటం ఏమిటి, శాస్త్రిలుగారు అలావెళ్లారు, నేను ఇలావెళ్లాను. అన్ని సంగతులు మాట్లాడాను, రేపు వచ్చే ఎనిమిదోతారీఖునే లగ్నం" అని వెళ్లిపోయారు.

పచ్చనితోరణాలలో, సన్నాయి వాయిద్యాలలో కళకళలాడే పందిట్లో నిర్మలతో నా వివాహమయింది.

తరువాత నిర్మల ఒకరోజున చెప్పింది. వాళ్ల నాన్నగారే, ఇలా చెప్పమని శాస్త్రిలుగారిని పంపించారని కొంత లంచంగూడా ఇచ్చారని. నా ఆశ్చర్యానికంతు లేకపోయింది. చివరకు ఎలాగయితేనేమి నా నిర్మల నాకు దక్కింది. ★